


ఊహ తెలిసినప్పటి నుంచి ఆమె నాకు బాగా తెలుసు. తెలియడమేమిటి-ఆమెతో నాకు గొప్ప అనుబంధం వుంది. విశాలమైన మా ఇంటి ప్రాంగణంలో ఒకపక్కగా స్థావరం ఏర్పరచుకున్న ఆమె మా ఇంట్లో వాళ్లందరికీ చిర పరిచితురాలు. వయసెంతో అంచనా కట్టలేను కాని మంచి యవ్వనంలో వున్నట్టు పచ్చగా కళ కళలాడుతూ నిండుగా, ఆరోగ్యంగా వుండేది.

నిత్యం ఏదో ఒక వేళలో ఆమెను చూడకుండా వుండడం నాకు అసాధ్యం. అసలు నా బాల్యమంతా సగం కాలం ఆమె సన్నిధిలోనే గడిచిపోయింది. నా ఆటలూ, పాటలూ అన్నీ ఆమె ఒడిలోనే. స్నేహితులతో కలిసి ఆమె ముంగిట్లో దాగుడుమూతలు, కోతి కొమ్మచ్చి ఆడేవాడిని. అలసిపోతే శీతల సమీరం లాంటి ఆప్యాయతతో సేద తీర్చేది. ఇక వేసవి కాలమైతే ఎండ దెబ్బ తగలకుండా కాపాడేది. అందుకని శెలవుల్లో పగలూ రాత్రీ కూడా ఆమె ఒడిలోనే విశ్రమించేవాడిని.

పిల్లలతోపాటు పిట్టలన్నా ఆమెకు బహు ప్రీతి. ఆమె ఆదరణ ఎన్నెన్నో పక్షులకు నిలయం. వాటి కిలకిలా రావాలు వింటూ మైమరచిపోయేది. తల్లి పక్షులు మేత కెళితే పిల్లల్ని పదిలంగా చూసుకునేది. తన జీవితమంతా ఇతరుల కోసమే అన్నట్టు పలు విధాల సేవలు చేస్తుంటే ఆశ్చర్యపోయేవాడిని.

"చదువు-సంధ్య లేకుండా ఎంతసేపూ అక్కడేనా!" అని అమ్మ కేకలేసినప్పుడు కూడా చాప, పుస్తకాలు తీసుకుని ఆమె దగ్గర కూర్చుని ఎంతో ప్రశాంతంగా చదువుకోగలిగేవాడిని.

అమ్మ ఒడి తర్వాత అంత చల్లని ఒడి ఆమె సన్నిధే.

అటువంటి త్యాగమూర్తి పట్ల స్వార్థంతో నాన్న తీసుకున్న నిర్ణయం నన్ను విపరీతంగా కలవరపరిచింది. ఆమె నాశనానికి నాన్న కంకణం కట్టుకోవడం నేను భరించలేకపోయాను.

ఆయనతో వాదించాను. ఆమెతో వున్న అనుబంధాన్ని జ్ఞప్తికి తెచ్చాను. ఆమె ఔన్నత్యాన్ని విశదీకరించాను. ఎన్నో రకాలుగా ఆయన మనసును మార్చాలని ప్రయత్నించాను.

నన్నొక పిచ్చివాడిలా చూసి "నీ తిక్క వాగుడు కట్టిపెట్టు. ఎవరైనా వింటే నవ్వుతారు. మనం కట్టబోయే కొత్త ఇంటి కోసం ఈ పని చేయక తప్పదు. రేపు కూలీలొచ్చి ఆ పనేదో వాళ్లు చూసుకొంటారు. నీ పనేదో నీదువ్" అంటూ తేలిగ్గా తీసి పారేసాడు.

నా హృదయంలో ఏదో అలజడి చెలరేగి నా కళ్లు సజలమవుతున్నాయి. ఆమెనెలా రక్షించుకోవాలో తెలియక ఆలోచనలతో రాత్రంతా జాగరణ చేశాను.

పొద్దుటే కూలీలొచ్చారు. నాన్న దగ్గరుండగానే ఒకడు ఆమె మీదకు గొడ్డలి ఎత్తాడు. మరొకడు రంపం దూసాడు.

గుండెలు మండిపోతుంటే ఒక్క వుదుటున ఆమెను చేరి అడ్డుగా నిలబడ్డాను.

నాన్న మొహం కందగడ్డగా మారగా "ఇవతలకు రా" అంటూ అరిచాడు.

"ఊహు. పని మొదలుపెట్టమనండి. ఆమెతో పాటే నేనూ!"

దిగ్భ్రమతో చూస్తుండిపోయాడు. కూలీలు రెండడుగులు వెనక్కి వేశారు.

ఈ అనుబంధం, ఆత్మీయత వాళ్ల సామాన్యమైన ఆలోచనలకు అందడం లేదు. అందుకే చేతులు జోడించి మరీ చెప్పాను.

"నాన్నా! ఒక మనిషి మరొకడికి సహాయపడతాడన్నది సందేహమే. కాని ఒక పచ్చని మొక్క పదిమందికి వుపయోగపడుతుందన్నది నిజం. చెట్టు చేమను కూడా మనిషిగా చూడడం నేర్చుకుంటే మానవత్వం సజీవమై ఈ భూమ్మీద మానవునికి మరింత పదిలమవుతుంది" అంటూ ఏడ్చాను.

—కొండా కుసుమకుమారి

